క్లుప్తంగా

62 మందికి వైద్య పరీక్షలు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నీరజ

కిర్లంపూడి: ఆయుర్వేద వైద్యశాల ద్వారా వృద్ధులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని డాక్టర్ ఎం.నీరజ అన్నారు. మండలంలోని బూరుగుపూడి జెడ్పీ పాఠశాల ఎదురుగా ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక, పరసర గ్రామాల నుంచి వచ్చిన సుమారు 62 మంది రోగులకు బీపీ, షుగర్‌తో పాటు పలు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం రోగులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పి.అచ్యుతాంబ, ఎస్.పద్మరాజు, ఎస్.కృపారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు కౌలు కార్డులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రౌతులపూడి: మండలంలోని రైతులకు గురువారం కౌలు కార్డుల ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ సీహెచ్ విద్యాపతి ఆధ్వర్యంలో రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలో కౌలు సాగు చేసే ప్రతి రైతు కౌలుకార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు మాట్లాడతూ కౌలు రైతులు ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలతో పాటు అన్నదాత సుఖీభవ, పంటనష్ట పరిహారం వంటి పలు పథకాలు పొందేందుకు కౌలుకార్డులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రైతులు కౌలు కార్డులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పీవీవీ సత్యనారాయణ, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న డీసీపీఓ వెంకట్, సీడీపీఓ శ్రీలత

తొండంగి: మండలంలోని కొమ్మనాపల్లి గ్రామానికి చెందిన దొడ్డి నాగమణి ఇటీవల డయేరియాతో మృతి చెందారు. బాధిత కుటుంబానికి కాకినాడకు చెందిన కేటీపీ ఆర్గనైజేషన్ ప్రతినిధి ప్రవీన్ చక్రవర్తి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించినట్టు ఐసీడీఎస్ తుని ప్రాజెక్టు సీడీపీఓ శ్రీలత తెలిపారు. గురువారం కాకినాడ జిల్లా డీసీపీఓ వెంకట్‌తో కలసి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా దాత సమకూర్చిన రూ.10 వేలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత కుటుంబం, చిన్నారుల ఆర్థిక పరిస్థితులపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. తల్లి మృతితో అనాథలైన ఇద్దరు బాలికలను చిల్డ్రన్స్ హోమ్‌లో చేర్పేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.

వచ్చే నెల 3న కౌన్సిల్ సమావేశం

తుని: ప్రతినెలా క్రమం తప్పకుండా జరగాల్సిన కౌన్సిల్ సాధారణ సమావేశం అనూహ్యంగా వచ్చే నెలకు వాయిదా పడింది. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో వచ్చే నెల 3న కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు కమిషనర్ వెంకట్రావు గురువారం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

టీఎన్‌యూఎస్ రాష్ట్ర కార్యదర్శిగా కృష్ణమోహన్

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎస్.కృష్ణమోహన్ తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎస్‌యూఎస్) రాష్ట్ర కార్యదర్శిగా, ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షుడిగా నియమితులైయ్యారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో రాష్ట్ర టీఎన్‌యూఎస్ అధ్యక్షులు మన్యం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కృష్ణమోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యాయులు, యూనియన్ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు అన్నదానం

సామర్లకోట: పేదలకు సేవలందించడమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఏర్పడిందని క్లబ్ అధ్యక్షుడు కానుబోయిన విజయకృష్ణ తెలిపారు. దీనిలో భాగంగా పట్టణ పరిధిలోని సుమారు 60 మంది పేదలకు భోజనాలు అందజేసినట్టు ఆయన తెలిపారు. ఎటువంటి ఆధారం లేని వారికి భోజనం పొట్లాలు అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. మాజీ అధ్యక్షుడు గుండు శంకరరావు పాల్గొన్నారు.

నో ఫిట్.. అనుమతి కట్

- ఫిట్‌గా ఉంటేనే బడి బస్సులకు అనుమతులు
- కత్తిపూడి రవాణాశాఖ పరిధిలో 220 స్కూల్ బస్సులు
- నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు



పాఠశాల బస్సుల ఫిట్‌నెస్‌ను పరిశీలిస్తున్న కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

తొండంగి: ప్రమాదాల నివారణలో భాగంగా ప్రైవేటు స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రైవేటు పాఠశాలల బస్సుల్లో ఫిట్‌నెస్‌కు సంబంధించి రవాణాశాఖ ద్వారా కచ్చితమైన నిబంధనలు అమలు చేస్తోంది. 2019కి ముందుకు ఫిట్‌నెస్ లేని బస్సుల కారణంగా ప్రమాదాలకు అవకాశం ఉండేది. గత ప్రభుత్వం స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. నూతన ప్రభుత్వం కూడా ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్‌పై రవాణాశాఖకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న బస్సులకు ఫిట్‌నెస్ నిరాకరిస్తున్నామని కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ తెలిపారు.

ఆరు మండలాల్లో 1400 స్కూల్ బస్సులు

జిల్లా వ్యాప్తంగా కాకినాడ, పెద్దాపురం, కత్తిపూడి పరిధిలో మొత్తంగా 1400 స్కూలు బస్సులు ఉన్నాయి. కత్తిపూడి రవాణాశాఖ ఆఫీస్ పరిధిలో తుని, ప్రత్తిపాడు, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి వివిధ ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన 215 బస్సులు ఉన్నాయి. పాఠశాల విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో గత కొద్ది రోజుల నుంచి ఇప్పటి వరకూ 190 ఫిట్‌నెస్‌లు పూర్తి చేశారు. కాగా వీటిలో 15 ఏళ్ల జీవిత కాలం ముగియడంతో కొన్ని బస్సులు స్క్రాప్‌కి వెళ్లాయి. మరికొన్ని బస్సులు రిపేర్లు, ఐదు బస్సులు స్టాపేజ్‌లో ఉన్నాయి. ఏపీ మోటార్ వెహికిల్ చట్టం 1989 ప్రకారం పాటించాల్సిన నిబంధనలను ఆయన వివరించారు.

నిబంధనలు ఇలా...

- బస్సుల్లో అగ్నిప్రమాదాలు సంబంధించినప్పుడు మంటలను ఆర్పేందుకు ఫైర్ ఎక్స్టెండ్యూసర్ కచ్చితంగా ఉండాలి.
- రోడ్డు ప్రమాదాలు జరిగితే ప్రాథమికంగా చికిత్స అందించేందుకు ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉండాలి.
- రాత్రి సమయాల్లో ప్రయాణాలు సాగించినప్పుడు బస్సుకు వెనుక రిఫ్లెక్టర్ రేడియమ్ స్టిక్టర్స్ ఉండాలి.
- బస్సు వెనుక, ముందు భాగాల్లో ఇందులో పిల్లలు ప్రయాణిస్తున్నారని రాయించాలి.
- బస్సు నిలిపివేస్తే పల్లపు ప్రాంతాల్లోకి కదిలిపోకుండా చక్రాలను పట్టి ఉంచే హ్యాండ్ బ్రేక్ వర్కింగ్‌లో ఉండాలి.
- స్కూల్ బస్సులో విద్యార్థులు కూర్చునే సీటు కింద బ్యాగ్‌లను సులభంగా పెట్టి తీసుకునే విధంగా బ్యాగ్ ర్యాక్స్ ఉండాలి.
- స్కూల్ బస్సు డ్రైవింగ్ చేసే వ్యక్తికి 5 ఏళ్లు అనుభవం, వ్యక్తికి 60 ఏళ్లు దాటకూడదు. బస్సులో పిల్లలను ఎక్కించి, దించేందుకు అటెండర్ తప్పనిసరిగా ఉండాలి.
- బస్సులు కుడివైపు, ఎడమ వైపు మలుపులు తిరిగేప్పుడు సిగ్నల్ బ్లింకర్స్ పనిచేయాలి.
- బస్సులో విద్యార్థులు చేతులు, తల బయటపెట్టకుండా కిటికీలకు మూడు వరసల గ్రిల్స్ ఉండాలి.
- స్కూల్ బస్సు 60 కిలోమీటర్ల స్పీడ్ వెళ్లరాదు. ఫిట్ నెస్ సమయంలో తనిఖీ చేసి అధిక స్పీడ్ ఉంటే బస్సు ఇంజిన్‌లో స్పీడ్ లాకింగ్ చేస్తారు.

190 బస్సులకు ఫిట్ నెస్ పూర్తి చేశాం



రవాణాశాఖ మార్గదర్శకాల ప్రకారం ఆరు మండలాల పరిధిలో 190 బస్సులను స్వయంగా పరిశీలించి నిబంధనల ప్రకారం ఫిట్‌నెస్ టెస్టులు చేశాం. ఫీల్డ్‌లో తనిఖీలు నిర్వహించి అనుమతులు లేని బస్సులు నడిపితే వాటిని సీజ్ చేస్తాం. సంబంధిత కళాశాల, స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– బి.శ్రీనివాస్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, కత్తిపూడి ప్రాంతీయ కార్యాలయం.

చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించాలి



కొండ గౌరంపేటలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ పద్మావతి

శంఖవరం: చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు మంచి పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి సూచించారు. మండలంలోని మండపం పంచాయతీ కొండగౌరంపేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం మన అంగన్‌వాడీ పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా చిన్నారులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ తల్లిదండ్రులు 5 సంవత్సరాల లోపు చిన్నారులను అంగన్‌వాడీలకు పంపించాలన్నారు. బాల్యం నుంచి చిన్నారులకు మంచి విద్యను అందిస్తే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సకాలంలో అందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీవీ రజిని, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త నేర చట్టాల అమలును నిలిపివేయాలి



ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల నిరసన

ప్రత్తిపాడు: ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) దేశవ్యాప్త నిరసనలో భాగంగా కొత్త నేర చట్టాల అమలును నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో గురువారం న్యాయవాదులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐలాజ్ రాష్ట్ర అడ్‌హక్ కమిటీ కన్వీనర్ బుగత శివ మాట్లాడుతూ ప్రస్తుతం అమలులో ఉన్న భారతీయ శిక్షాస్మృతి 1860, భారతీయ సాక్ష్యాధారాల చట్టం 1872, భారతీయ నేర విధాన స్మృతి 1973 చట్టాలు రద్దుకానున్నాయన్నారు. వాటి స్థానంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత 2023, భారతీయ న్యాయ సంహిత 2023, భారతీయ అధినియం 2023 అనే మూడు కొత్త నేర చట్టాలు జూలై 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయని తెలిపారు. ఈ కొత్త చట్టాలలోని పలు నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని అనుమానాలు వ్యక్తమవుతున్న దృష్ట్యా వాటిపై న్యాయమూర్తులు, న్యాయవాదులు, నేర దర్యాప్తు సంస్థలు, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు, దేశ పౌరులు సమగ్రంగా చర్చించవలసిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు తక్షణమే ఈనేర న్యాయ చట్టాల అమలును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాద ప్రతినిధులు అవసరాల దేవి, పిల్లి బలరాముడు, రాయి శ్రీనివాసరావు, గడ్డం కామేశ్వరరావు, రెడ్నం వెంకటరెడ్డి, వెంకటలక్ష్మి, కలవలపల్లి సుజన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సూర్యనారాయణ స్వామి గ్రామోత్సవం



గోకవరంలో సూర్యనారాయణస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న మహిళా భక్తులు

గోకవరం: గ్రామంలో ఉషాపద్మినీ ఛాయా సమేత సూర్యనారాయణస్వామి గ్రామోత్సవం గురువారం వైభవంగా జరిగింది. స్థానిక వెలమపేటలో సనాతన ధర్మ ప్రబోధన స్వచ్ఛంద సమితి ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనేక మంది మహిళలు పాల్గొని భక్తి గీతాలు ఆలపించారు. మేళతాళాల నడుమ నిర్వహించిన ఈ ఊరేగింపులో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని హారతులు సమర్పించారు. కార్యక్రమంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు, ఉపాధ్యక్షుడు అక్షింతల రాజా, ప్రధాన కార్యదర్శి దోసపాటి సుబ్బారావు, పిల్లంగోరు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్చాలి

పెద్దాపురం: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో 'గ్రాడ్యుయేషన్ డే', 'నే బడికి పోతా' కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎన్.ఉమాదేవి అన్నారు. మండలంలోని జె.తిమ్మాపురంలో గురువారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గ్యాడ్యుయేషన్ డే నిర్వహించారు. అనంతరం గ్రామంలో పాఠశాల సిబ్బందితో కలిసి నే బడికి పోతా కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఉమాదేవి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ విద్యకు ప్రాధాన్యతమివ్వాల్సిన అవసరం ఉందన్నారు. పిన్న వయసు నుంచే విద్యా బుద్ధులు నేర్పేందుకు నే బడికిపోతా కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర వర్మ, ఏఎన్‌ఎం నాగమణి, లీలారాణి, పరంజ్యోతి, పాఠశాలల సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ సునీత

ఏలేశ్వరం: యువత, విద్యార్థులకు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత సూచించారు. కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై గురువారం విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల వాడకం ద్వారా నాడీవ్యవస్థ దెబ్బతిని అనారోగ్య పాలవుతున్నారన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. చెడు వ్యసనాలతో చదువుపై ఏకాగ్రత కోల్పోయి నష్టపోతారన్నారు. అనంతరం మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చెన్నారావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం మేనేజర్ ప్రగడ ప్రయాగమూర్తి, అధ్యాపకులు రామారావు, శ్రీలక్ష్మి, సురేష్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రాక్ సిరామిక్స్ కార్మికుల ఆందోళన



రాక్ సిరామిక్స్ గేటు వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ నుంచి తొలగించిన కార్మికులు గురువారం అర్ధ నగ్న ప్రదర్శన చేసి ఆ సంస్థ ముందు బైఠాయించారు. ప్రైవేటు పరిశ్రమల్లో కార్మికులను తొలగించే కార్యక్రమాన్ని మానుకోవాలని, వారికి సీఐటీయూ అండగా ఉంటుందని ఆ శాఖ జిల్లా ఉపాధ్యక్షుడు నీలపాల సూరిబాబు అన్నారు. గత 15 రోజు లుగా కార్మికులు ఫ్యాక్టరీ గేటు ఎదుట శాంతియుతంగా ఆందోళన చేస్తున్నా యజమాన్యం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బుధవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయని తెలిపారు. తొలగించిన కార్మికులకు మూడు నెలల జీతాలు ఇస్తామని యజమాన్యం చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు. తొలగించిన కార్మికులకు ఉద్యోగ వయసు దాటి పోవడంతో ఏ ఫ్యాక్టరీలోనూ ఉద్యోగం వచ్చే అవకాశం లేదన్నారు. తొలగించిన కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని చెప్పారు. కార్మికులకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్, పట్టణ కార్యదర్శి సురేష్, పెద్దాపురం అధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు, ప్రజానాట్య మండలి కళాకారులు వీర్రాజు, కృష్ణ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, రాజబాబు, సతీష్‌కుమార్, గంగాధర్, శివనారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ ధర్నా



జగ్గంపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతు కూలీ సంఘం నేతలు

జగ్గంపేట: గ్రామంలో ఇళ్లులేని నిరుపేదలు చాలా మంది ఉన్నారని, వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, జిల్లా సహాయ కార్యదర్శి కడితి సతీష్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఇంతియాజ్ పాషాకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగ్గంపేటలో గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండు వేల మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందన్నారు. గ్రామంలో ఇంకా 500 మంది ఇళ్ల స్థలాలు లేని పేదలు ఉన్నారని తెలిపారు. జగ్గంపేటలోని జగనన్న కాలనీకి ఆనుకుని ఉన్న స్థలాన్ని వీరికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు కె.రామలింగేశ్వరరావు, దేశెట్టి సురేష్, ఎల్లే సత్తిబాబు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జోరు వాన

- రోజంతా ఎడతెరిపి లేకుండా కురిసిన వైనం
- పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం



ఏలేశ్వరంలో కురుస్తున్న వర్షం

ఏలేశ్వరం: అల్పపీడన ద్రోణి ప్రభావంతో నియోజవర్గవ్యాప్తంగా గురువారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ వర్షం పడింది. ఎడతెరిపి లేకుండా చినుకులు పడటంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షానికి రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆరుద్ర కార్తె ప్రారంభం ఎండలు ఎక్కువగా ఉండగా ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి. ఈ వర్షాలు ఖరీఫ్ సాగుకు మేలు చేస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఖరీఫ్ ప్రారంభం కావల్సి ఉండగా వర్షాలు లేక ఆలస్యమైంది. వర్షపు నీరు రహదారులపై నిల్వ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోజంతా వర్షమే

తుని రూరల్: మండల వ్యాప్తంగా గురువారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో రోడ్లపై నీరు చేరింది. వేసవిలో అధిక ఉష్ణోగ్రతలతో తడారిపోయిన్న భూముల్లో విస్తారంగా కురిసిన వర్షపు నీరు ఇంకిపోయింది. కాలువులు, చెరువుల్లోకి వర్షపునీరు చేరలేదు. ఇప్పుడిప్పుడే విత్తుతున్న, మొలకెత్తిన పత్తి చేలు, కూరగాయల పైర్లు పదునెక్కాయి. కొంతమంది రైతులు నీటి పారుదలకు కాలువలు ఏర్పాటు చేయడంతో ఈ వర్షానికి ఎటువంటి నష్టం వాటిల్లబోదని రైతులు తెలిపారు. వర్షం ముసురుకుంటే పత్తిపైర్లకు ఆదిలోనే విపత్తి కలుగనుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మరిన్ని భారీ వర్షాలు కురిస్తే ఖరీఫ్ వరినార్లు, నాట్లు వేసేందుకు అవకాశం కలుగుతుందని వ్యవసాయ తుని సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు తెలిపారు.



ఎస్.చామవరంలో వర్షానికి పదునెక్కిన పత్తి మొక్కలు

చల్లబడిన వాతావరణం

తుని: వేసవి తాపంతో అల్లాడిన ప్రజలు గురువారం కురిసిన వర్షానికి ఉపశమనం పొందారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పట్టణ పరిధిలోని పల్లపు ప్రాంతాలు వర్షం నీటితో నిండిపోయాయి. వాహన చోదకుల రాకపోకలకు అంతరాయం కలిగింది. కొండవారిపేట రైల్వే అండర్ పాస్, ఆంజనేయస్వామి గుడి, బాడవతోట, పాత బజారు తదితర ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. ప్రజలకు ఇబ్బంది లేకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. మెట్టలో పంటల సాగుకు అనుకూలత లభించిందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఖరీఫ్ సీజన్ పనులు ప్రారంభానికి రైతులు సమాయత్తం అవుతున్నారు.

గోకవరంలో..

గోకవరం: మండల వ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం పూర్తిగా స్తంభించింది. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గోకవరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మలుపులో ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మరోపక్క రైతులు పంట పొలాల్లో వ్యవసాయ పనులు చేపట్టారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడతాయనే వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. చెరువులు నిండితే పంటలకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.



ఎస్.అన్నవరంలో బెండ మొక్క తోటలో చేరిన నీరు



తునిలో రోడ్డుపై నిలిచిపోయిన వర్షం నీరు

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి



శంఖవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న డీఈఓ పిల్లి రమేష్

శంఖవరం: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డీఈఓ పిల్లి రమేష్ ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో జరిగిన నాడు–నేడు పనులను గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టీలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు త్వరగా అందించాలన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి వారిలో నైపుణ్యాలను వెలికి తీయాలన్నారు. మధ్యాహ్నం భోజనాన్ని రుచిగా, నాణ్యతతో విద్యార్థులకు సకాలంలో అందించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు.

తాగునీటి పరీక్షలు చేయాలి

బోట్‌క్లబ్: డయేరియా వ్యాప్తి నేపథ్యంలో స్మార్ట్ సిటీలో డివిజన్ల వారీగా తాగు నీటి పరీక్షలు నిర్వహించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం ఒక ప్రకటనలో కోరారు. పలు ప్రాంతాల్లో 40 శాతం కుళాయి గొట్టాలు డ్రైన్లలో ఉన్నాయన్నారు. అత్యధిక ప్రాంతాల్లో 25 శాతం లీకేజీ సమస్యలున్నాయన్నారు. దీంతో చాలా మంది మున్సిపల్ నీరు తాగడం లేదని, అధికారులు సత్వర చర్యలు చేపడితే అతిసార బెడద ఉండదన్నారు.